JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 05-08-2026
Medchal - Malkajgiri | Wednesday 05-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 65
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 65 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




# విదేశీ ఉద్యోగాల కోసం ప్రత్యేక శిక్షణ

- ఏటీసీలతో ఉపాధి అవకాశాలు మెరుగు
- యువతకు ఆధునిక శిక్షణ అందిస్తాం
- విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ట్రైనింగ్ ఇప్పిస్తాం
- రుద్రంగిలో రూ.45 కోట్లతో ఏటీసీ కేంద్రానికి భూమి పూజ

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ యువతకు దేశీయంగానే కాకుండా విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ATCs) ఏర్పాటు ద్వారా ఆధునిక సాంకేతిక విద్య అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో రూ.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఏటీసీ భవనానికి కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మంగళవారం భూమిపూజ చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ.4,000 కోట్ల వ్యయంతో 65 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సాంప్రదాయ ఐటీఐలను ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. గత రెండున్నరేళ్లలో లక్ష మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించామని, ఏటీసీల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైపెండ్ కూడా అందజేస్తున్నట్లు వెల్లడించారు. విదేశీ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న ...మిగతాది 2 లో

# ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సి ఉంది

- ప్రధాని స్వానిధి సపోర్ట్ పొందడంలో ఏపీ దేశంలోనే నెంబర్ టూ
- ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచుతున్నాం
- శ్వేతపత్రం విడదల చేసిన సీఎం చంద్రబాబు నాయుడు



**జయభేరి, అమరావతి :**

స్పష్టమైన విజన్తో, హామీలు నెరవేరుస్తూ, నమ్మకాన్ని నిలబెట్టుకుని సాగుతున్నాం. ప్రజలకు వాస్తవాలు ఎప్పటికప్పుడు చెబుతున్నాం.. వారు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మంగళవారం నాడు అయన రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై శ్వేతపత్రం విడుదల చేసారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ అయిదేళ్ల విధ్వంసం కలిగించిన నష్టాలు ఇంకా మనల్ని వేధిస్తూనే ఉన్నాయి.. ఎన్నినో వంటివి వచ్చినా సరే.. భయపడని, సుస్థిరమైన మెకానిజం లను తయారుచేయాలి. అలాగే గ్రామీణ స్వయం సహాయక సంఘాలు బ్యాంకులద్వారా రుణాలు పొందడంలో ఏపీ భారత్లో నెంబర్ వన్ గా నిలుస్తోంది. 97 శాతం సంస్థలు బ్యాంకు రుణాలు పొందాయి.. యాభై శాతానికి పైగా స్వయం ఉపాధులకు రుణాలు వాడుతున్నాయి. సంఘాల రుణాల ప్రక్రియను పూర్తి డిజిటలైజ్ చేయడం ద్వారా.. ఏపీ దేశంలోనే రోల్ మాడల్ గా ఆవిర్భవించింది. ...మిగతాది 2 లో

# మారుతున్న రాజకీయాలు

...మిగతాది 2 లో

## వామ్మో.. ఇవి మసాలాలేనా?

- హైదరాబాద్‌లో ఆగని కల్తీ దందాలు
- 25 టన్నుల కల్తీ మసాలాలు, 90 టన్నుల ముడిపదార్థాలు సీజ్
- సింథటిక్ రంగులు, ఇండస్ట్రియల్ డైలు, టాల్కమ్ పౌడర్ వంటి ప్రమాదకర రసాయనాలతో మసాలాలు తయారు
- ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి క్రిమినల్ కేసులు నమోదు.. హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్




**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో ఆహార కల్తీ ముఠాల ఆట కట్టించేందుకు హెచ్‌ఫాస్ట్ అధికారులు భారీ స్థాయిలో దాడులు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆహార కల్తీలకు పాల్పడేవారిపై తనిఖీలు నిర్వహిస్తూ.. భారీ ఎత్తున కల్తీలను పట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 25.3 టన్నుల కల్తీ మసాలా దినుసులు.. 89.15 టన్నుల ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

## రాజకీయాల్లోకి రావడం లేదు

- పవన్ భూములు ఆక్రమించలేదు.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- ఏవీ రంగనాథ్‌పై దాఖలైన పలు కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం




**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 4 :**

తాను రాజకీయాల్లోకి వస్తున్నానంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫుల్‌స్టాప్ పెట్టారు. తన ఉద్యోగాన్ని ప్రశాంతంగా చేసుకోనివ్వాలని కోరుతూ, జనసేన పార్టీలో చేరతాననే వార్తలను ఆయన కొట్టిపారేశారు. పవన్ కల్యాణ్‌కు సంబంధించిన కోడి చెరువు భూ వివాదం, తనపై వెలువడిన కోర్టు ధిక్కరణ ఆరోపణలపైనా ఆయన వివరణ ఇచ్చారు."నాకు మెగాస్టార్ చిరంజీవి కుటుంబంతో గత 20 ఏళ్లుగా మంచి పరిచయం ఉంది.

## ఎన్‌డీఏ 'మంగళ్ మిలన్' సమావేశం

- ప్రధాని మోదీతో కలిసి కీలక నేతల హాజరు, పలు అంశాలపై చర్చ




**జయభేరి, న్యూఢిల్లీ:**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ వారాంత సమావేశం 'మంగళ్ మిలన్' పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగింది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు ఎన్‌డీఏ కూటమికి చెందిన పలువురు ఎంపీలు, కీలక నాయకులు హాజరయ్యారు. ఈ వివరాలను ANI వెల్లడించింది. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా పాల్గొన్నారు. పార్లమెంట్ సమావేశాల మధ్యలో కూటమి పార్టీల మధ్య సమన్వయం, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా ప్రయోజన అంశాలపై చర్చించేందుకు ఎన్‌డీఏ ప్రతి వారం 'మంగళ్ మిలన్' సమావేశాన్ని నిర్వహిస్తూ వస్తోంది.


## పోలీస్ ఉద్యోగాల భర్తీపై నిఘా..

- రాష్ట్రంలో 7,437 పోలీస్ ఉద్యోగాల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్
- నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం
- సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- అధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు




**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్ కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు.




## 30 సెకన్లలో 34 కత్తిపోట్లు..!

- విద్యార్థుల ఎదుటే టీచర్ దారుణ హత్య

**జయభేరి, న్యూఢిల్లీ:**

హరియాణాలోని ఫరీదాబాద్ లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ పాఠశాలలో దారుణ హత్య జరిగింది. మహిళా టీచర్ ను ఓ దుండగుడు విచక్షణా రహితంగా పొడిచి చంపాడు. 30 సెక్షన్లలోనే దాదాపు 34 కత్తిపోట్లతో ఆమెపై విరుచుకుపడ్డాడు. దాంతో ఆమె పాఠశాలలోనే కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. దాంతో దుండుగుడు అక్కడి నుంచి పారిపోయాడు. తోటి టీచర్లు ఘటనాస్థలికి వచ్చేలోపే ఈ షాకింగ్ ఘటన క్షణాల్లో జరిగిపోయింది.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రత్యేక శిక్షణ

యువత కోసం ప్రత్యేకంగా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రుద్రంగి ఏటీసీకి జర్మన్ భాషా శిక్షకుడిని పంపించి, తొలి దశలో 100 మంది యువతను విదేశీ ఉద్యోగాలకు సిద్ధం చేసే ప్రణాళిక ఉందన్నారు. అలాగే వ్యవసాయ రంగంలో వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు (AI) వంటి ఆధునిక కోర్సులను కూడా ఏటీసీల్లో ప్రవేశ పెట్టనున్నట్లు వెల్లడించారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రుద్రంగిలో ఏర్పాటవుతున్న ఏటీసీ ఈ ప్రాంత యువతకు కొత్త అవకాశాలకు వేదిక కానుందని అన్నారు. ఇక్కడ 288 మంది విద్యార్థులు ఏడు విభాగాల్లో శిక్షణ పొందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే మూడపల్లిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం జరుగుతోందని, 2,500 మంది విద్యార్థులకు అక్కడ విద్యా సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. వేములవాడ ఆలయ అభివృద్ధి, రోడ్ల విస్తరణ, రెండో వంతెన నిర్మాణం, విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పరిశ్రమల్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఏటీసీల్లో కోర్సులు రూపొందించినట్లు తెలిపారు. కృత్రిమ మేధస్సు (AI), డ్రోన్ టెక్నాలజీతో పాటు మరో ఐదు ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందిస్తామని చెప్పారు. శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా యువత నైపుణ్యాలను పెంపొందించుకుని దేశీయ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

## ఎన్‌డీఏ 'మంగళ్ మిలన్' సమావేశం

ఇదిలా ఉండగా, నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) ఎంపీ సుదీప్ బంద్యోపాధ్యాయ్ కూడా ఈసారి సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ లైబ్రరీ భవనానికి చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి తాను తొలిసారిగా హాజరవుతున్నానని తెలిపారు. దేశంలో అత్యంత సీనియర్ పార్లమెంటేరియన్లలో తాను ఒకడినని పేర్కొంటూ, తమ పార్టీ అంతా ఐక్యంగా ఉందని స్పష్టం చేశారు. గత వారం జరిగిన 'మంగళ్ మిలన్' సమావేశానికి ఎన్‌సీపీఐకి చెందిన మైనారిటీ వర్గానికి చెందిన ముగ్గురు ఎంపీలు గైర్హాజరైన విషయం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అబూ తాహెర్ ఖాన్, ఖలీలుర్ రెహ్మాన్, యూసుఫ్ పఠాన్ సమావేశానికి రాకపోవడంతో పార్టీలో విభేదాలు ఉన్నాయనే ప్రచారం జరిగింది. అయితే అలాంటి ఊహాగానాలను ఎన్‌సీపీఐ నాయకత్వం ఖండించింది. మరోవైపు, తృణమూల్ కాంగ్రెస్ నాయకులు మాత్రం ఆ ముగ్గురు ఎంపీలు బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీలు పార్టీని వీడి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరినట్లు ప్రకటించారు. అనంతరం ఆ పార్టీ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం ముగింపు సందర్భంగా కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు కూటమి ఎంపీలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ విధానాలు, కూటమి సమన్వయం, పార్లమెంట్ వ్యూహాలపై పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్‌గోయల్ కూడా సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. ఇటీవల భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ ఆర్థికాభివృద్ధికి ఎలా దోహదపడుతున్నాయి, అంతర్జాతీయ వాణిజ్యంలో వాటి వ్యూహాత్మక ప్రాధాన్యం ఏమిటనే అంశాలను ఆయన వివరించారు. ఈ ఒప్పందాలు భారత ఎగుమతులకు కొత్త అవకాశాలు తీసుకువస్తున్నాయని, ప్రపంచ మార్కెట్లలో దేశ స్థాయిని మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. అదే విధంగా కేంద్ర పంచాయతీరాజ్, మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ దేశ మత్స్య రంగం అభివృద్ధిపై ప్రసంగించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, రంగంలో నమోదైన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై ఆయన సభ్యులకు వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రతిపక్ష ఆందోళనలతో ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. పరీక్షల సంస్కరణలు, విద్యార్థులపై పోలీసుల చర్యలపై ఆరోపణలు, రామమందిర విరాళాల అంశంపై ప్రతిపక్షం చేస్తున్న నిరసనలు వంటి కీలక విషయాల మధ్య ఎన్‌డీఏ నిర్వహించిన వారాంత 'మంగళ్ మిలన్' సమావేశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## పోలీస్ ఉద్యోగాల భర్తీపై నిఘా..

నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియలలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలిజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## వామ్మో.. ఇవి మసాలాలేనా?

ఈ ఆపరేషన్‌లో 13 మసాలా వ్యాపార సంస్థల్లో సోదాలు నిర్వహించి 3 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఇందులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వెల్లడించారు. నాణ్యత లేని మసాలా దినుసులతో పాటు సింథటిక్ రంగులు, క్లాత్ డైలు, ఇండస్ట్రియల్ కలర్స్, టాల్కమ్ పౌడర్, రైస్ బ్రాన్ ఆయిల్ వంటి హానికర పదార్థాలను కలిపి నిందితులు నకిలీ మసాలాలు తయారు చేస్తున్నట్లు సీపీ సజ్జనార్ గుర్తించారు. ముఖ్యంగా వాము, జీలకర్ర, షాజీరా, లవంగాలు, ఆవాలు వంటి నిత్యావసర మసాలాల్లో కల్తీ చేస్తున్నట్లు విచారణలో తేలింది. అలాగే అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో టైటానియం ఆక్సైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కల్తీ పదార్థాల్లో ఉపయోగించిన కొన్ని రసాయనాలు నీటితో కడిగినా పోవని.. అందువల్ల ప్రజలు వాటిని గుర్తించడం చాలా కష్టమని సీపీ సజ్జనార్ తెలిపారు. ఇలాంటి మసాలాలను దీర్ఘకాలంగా ఉపయోగించడం వల్ల కాలేయం, మూత్రపిండాల వ్యాధులు, అల్సర్లు, అలర్జీలు, జీర్ణ సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీదారులపై ఇకపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ తీవ్ర హెచ్చరికలు చేశారు. తీవ్రమైన కేసుల్లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) సెక్షన్ 110 కింద హత్యాయత్నం కేసులు కూడా నమోదు చేస్తామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. త్వరలో కల్తీ ఆహార పదార్థాల కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. హెచ్‌ఫాస్ట్ ఏర్పాటు చేసిన తర్వాత గత 140 రోజుల్లో 659 దాడులు నిర్వహించి.. 202 కేసులు నమోదు చేసి.. మొత్తం 246 టన్నులకుపైగా కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో బ్రాండ్, నాణ్యత, ప్యాకింగ్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా కల్తీ ఆహార పదార్థాల తయారీ లేదా విక్రయాలపై అనుమానం ఉంటే వెంటనే హెచ్ ఫాస్ట్ హెల్ప్‌లైన్ 8712661212 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# మారుతున్న రాజకీయాలు



ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉండేది. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు. కానీ కాలం మారుతోంది... రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది. ఇప్పుడు జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు, మహిళా సమావేశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ కావడం వంటి కొత్త పద్ధతులు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. మరి నిజంగానే పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా?తెలుగు రాష్ట్రాల్లో గత రెండు దశాబ్దాలుగా పాదయాత్రలు రాజకీయ విజయానికి కీలక వ్యూహంగా నిలిచాయి. 2003లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన "వస్తున్నా మీ కోసం", వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన "ప్రజా సంకల్ప యాత్ర" వంటి కార్యక్రమాలు రాజకీయంగా పెద్ద మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ఇవి సమర్థమైన వేదికలుగా మారాయి.అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకుడు ఒక గ్రామంలో చేసిన కార్యక్రమం క్షణాల్లోనే లక్షల మందికి చేరుతోంది. దీంతో ప్రజలను కలవడానికి పాదయాత్ర ఒక్కటే మార్గం కాదనే భావన బలపడుతోంది. ఇక ప్రజల అంచనాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. "ఎంత నడిచారు?" అనే ప్రశ్న కంటే "ఏం చేశారు?" అనే ప్రశ్నకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ముఖ్యంగా యువత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై నాయకుల చర్యలను గమనిస్తోంది. అందుకే రాజకీయ నాయకులు కూడా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నిరంతర ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ఇటీవలి కాలంలో మెగా జాబ్ మేళాలు, ఉచిత వైద్య శిబిరాలు, మహిళా సంఘాలతో సమావేశాలు, రైతు అవగాహన సదస్సులు, స్కిల్ ట్రైనింగ్ క్యాంపులు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అమలు చేస్తున్న కార్యక్రమాలుగా మారుతున్నాయి.అదే సమయంలో ప్రచార విధానంలో కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు పోస్టర్లు, భారీ బహిరంగ సభలు ప్రధాన ప్రచార సాధనాలైతే, ఇప్పుడు రీల్స్, షార్ట్ వీడియోలు, లైవ్ స్ట్రీమింగ్, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్థానిక స్థాయిలో చిన్న సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే రాజకీయ విజయాన్ని ఒక్క అంశంతోనే ముడిపెట్టలేమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ వాతావరణం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తాయి. భారతదేశంలో డిజిటల్, సోషల్ మీడియా విస్తరణ నేపథ్యంలో, ప్రజా చర్చ మరియు ప్రజాభిప్రాయ స్వయంప్రతిపత్తి సవాలుకు గురయ్యాయి. భారతదేశపు 2019 సార్వత్రిక ఎన్నికలు, నిజమైన డిజిటల్ వినియోగ సమాజంలో జరిగిన మొట్టమొదటి జాతీయ ఎన్నికలు. ఈ ఎన్నికలలో, ఓటర్లలో సుమారు సగం మందికి డిజిటల్ మార్గాలు అందుబాటులో ఉండగా, మరో మూడో వంతు మందికి సోషల్ మీడియా అందుబాటులో ఉంది. ప్రపంచ పోకడకు అనుగుణంగా, భారతీయ రాజకీయ నాయకులు తమ మద్దతుదారులతో నేరుగా మమేకమవ్వడానికి, రోజువారీ రాజకీయ సంభాషణల కోసం సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. జిటల్ వేదికలపై కార్యకలాపాలను, అలాగే అవి విస్తృత రాజకీయ సమీకరణ నుండి ఏ విధంగా విడదీయరానివిగా ఉన్నాయో విశ్లేషిస్తుంది.NUSలోని దక్షిణాసియా అధ్యయనాల సంస్థ మరియు కొన్రాడ్ అడెనార్ స్టిఫ్టుంగ్ నిర్వహించిన ఒక వర్క్‌షాప్‌లో ఈ పత్రాల ముసాయిదా ప్రతులు సమర్పించబడ్డాయి.''ప్రధాన మీడియా స్రవంతిని బీజేపీ తన నియంత్రణలోకి తీసుకుంది'' అని కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగం హెడ్ సుప్రియా శ్రీనేత్ అన్నారు. మా నిధులను స్తంభింపచేశారు. ప్రకటనలపై ఖర్చు పెట్టేందుకు మా దగ్గర డబ్బులు లేవు'' అని ఆమె అన్నారు. ఎన్నికలకు ముందుగా ఆదాయపు పన్ను విభాగం తీసుకున్న చర్యల గురించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం రాజకీయ ప్రతీకారం తీర్చుకుంటోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే, దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తున్నాయని, దీనిలో తమ పాత్రేమీ లేదని ప్రభుత్వం అంటోంది.''ఇలాంటి ఇబ్బందుల నడుమ ఓటర్లను చేరుకునేందుకు ఇన్‌ఫ్లూయెన్సర్లు వారధిలా పనిచేస్తున్నారు. మా పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం ఉండేవారితోపాటు మా వర్క్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయాలనుకునేవారితో మేం కలిసి పనిచేస్తున్నాం'' అని ఆమె చెప్పారు.సోషల్ మీడియాను ప్రజాస్వామ్యీకరించడంలో ఇన్‌ఫ్లూయెన్సర్లు సాయం చేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మాజీ పొలిటికల్ అడ్వైజర్ అంకిత్ లాల్ అన్నారు.ద దేశ్‌భక్త్ యూట్యూబ్ చానెల్ నడిపే మాజీ జర్నలిస్టు ఆకాశ్ బెనర్జీ మాట్లాడుతూ ఇన్‌ఫ్లూయెన్సర్లు తమ హద్దులను చెరిపేసుకుంటూ ఒక్కో అడుగు ముందుకు వెళ్తున్నారని చెప్పారు.జర్మనీ నుంచి యూట్యూబ్ చానెల్ నడిపిస్తున్న ధ్రువ్ రాఠీ తాజాగా చేసిన 'ఈజ్ ఇండియా బికమింగ్ ల డిక్టేటర్‌షిప్?' వీడియోను ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఆ వీడియోకు ఇప్పటివరకూ 24 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. దీనిపై ప్రభుత్వం స్పందించలేదు.'ఆ వీడియో తర్వాత డిక్టేటర్‌షిప్ అనే పదంపై చాలా చర్చ కొనసాగింది. ఇలా జరగడం నేను ముందెన్నడూ చూడలేదు'' అని బెనర్జీ అన్నారు.ఇన్‌ఫ్లూయెన్సర్‌స్‌గా మా పని కేవలం కిటికీ తెరిచి వర్షం పడుతుందో లేదో చూడటం మాత్రమే కాదు. నీలి మేఘాలు కమ్ముకుంటున్నప్పుడు, ఓటింగ్ ద్వారా మీరు వాటిని తొలగించొచ్చని ప్రజల్లో చైతన్యం కల్పించడం మా బాధ్యత'' అని ఆయన చెప్పారు.2029 ఎన్నికల్లో మరోసారి భారీ పాదయాత్రలే ప్రధాన అస్త్రంగా మారతాయా? లేక జాబ్ మేళాలు, సేవా కార్యక్రమాలు, డిజిటల్ కమ్యూనికేషన్, ప్రజలతో నిరంతర అనుబంధమే కొత్త రాజకీయ ఫార్ములాగా నిలుస్తుందా? దీనికి సమాధానం భవిష్యత్తులోనే తేలనుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది... ప్రజలతో అనుసంధానమయ్యే పద్ధతులు మారుతున్నాయి... వాటికి అనుగుణంగా రాజకీయాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

## రాజకీయాల్లోకి రావడం లేదు

పవన్ కల్యాణ్ తో కూడా సాన్నిహిత్యం ఉంది. అంతమాత్రానికే నేను ఉద్యోగానికి రాజీనామా చేసి జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యేగానో, ఎంపీగానో పోటీ చేస్తానని ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ జనసేన ఇన్‌చార్జ్‌గానూ నన్నే నియమిస్తారని సోషల్ మీడియాలో రాస్తున్నారు. దయచేసి నా ఉద్యోగం నన్ను చేసుకోనివ్వండి. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనే నాకు లేదు" అని రంగనాథ్ స్పష్టం చేశారు. గండిపేట సమీపంలోని జన్వాడలో ఉన్న పవన్ కల్యాణ్ భూమిపై చెలరేగిన వివాదంపై రంగనాథ్ సాంకేతిక అంశాలను వివరించారు. కోడికుంట చెరువు వద్ద ఉన్న ఈ భూమి విషయంలో వాస్తవాలను ఆయన వెల్లడించారు. "పవన్ కల్యాణ్ 2014లో నలుగురు రైతుల నుంచి సుమారు 10 ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశారు. ఆ తర్వాత 201516లో చెరువుకు ప్రిలిమినరీ నోటిఫికేషన్, 2023లో ఫైనల్ నోటిఫికేషన్ జారీ అయింది. చాలా మంది కబ్జాదారులు చెరువులను మట్టితో పూడ్చి నిర్మాణాలు చేపడతారు. కానీ, ఈ భూమి విషయంలో అలా జరగలేదు. భూమి సహజ స్వరూపం ఏమాత్రం మారలేదు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగలేదు," అని రంగనాథ్ వివరించారు. అయితే, ఒక సాంకేతిక ఉల్లంఘన జరిగిందని ఆయన అంగీకరించారు. "చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (FTL) పరిధిలోకి వచ్చేలా ఫెన్సింగ్ వేశారు. ఇది నీటి ప్రవాహాన్ని ఆపకపోయినా, నిబంధనల ప్రకారం తప్పు. అందుకే ఆ ఫెన్సింగ్‌ను తొలగించాలని సూచించాం. ఇలాంటి పట్టా భూములు వేల సంఖ్యలో ఉన్నాయి. సోషల్ మీడియా ఒత్తిళ్లకు తలొగ్గకుండా, అన్ని కేసుల్లో ఒకేలా వ్యవహరిస్తాం," అని స్పష్టం చేశారు. చెరువుల్లోని పట్టా భూములను ఎవరైనా కొనుగోలు చేయవచ్చు, అమ్ముకోవచ్చు" అని రంగనాథ్ వివరించారు. ఇదిలా ఉండగా.. ఏవీ రంగనాథ్‌పై దాఖలైన పలు కోర్టు ధిక్కరణ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి కూల్చివేతలు చేపట్టారని మండిపడింది. ఈ క్రమంలో ఆయన్ను వెంటనే హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, హైకోర్టు ఆదేశాలపై న్యాయపోరాటం చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోంది.

## ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సి ఉంది

ప్రధాని స్వానిధి సపోర్ట్ పొందడంలో ఏపీ దేశంలోనే నెంబర్ టూగా ఉంది. సంఘాలు సాధించిన అద్వితీయ విజయాలివని అన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయిందని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "201415లో తెలంగాణ, ఏపీ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం రూ.30,201గా ఉండేది. మా ఐదేళ్ల పాలనలో దాన్ని రూ.25,000కు తగ్గించగలిగాం. కానీ, 201924 మధ్య కాలంలో ఈ వ్యత్యాసం ఏకంగా రూ.1,06,854కు పెరిగిపోయింది. ఒకవేళ 201419 మధ్య సాధించిన 13.5% వృద్ధిరేటు కొనసాగి ఉంటే, రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు" అని ఆయన విశ్లేషించారు. రూ.9.74 లక్షల కోట్ల అప్పు చేసి వెళ్లిన జగన్ ప్రభుత్వం తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత తప్పులను సరిదిద్దడంతో పాటు ప్రజలు మరియు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునరుద్ధరించాల్సి వచ్చింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించాల్సి వచ్చింది. ఇందుకోసం కూటమి ప్రభుత్వం చతుర్ముఖ వ్యూహంతో ముందుకెళ్లిందని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను నిర్ణయించే తలసరి ఆదాయం విషయంలో విభజన తర్వాత ఏపీ వెనుకబడింది. అహరహమూ కష్టపడుతూ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచి తద్వారా వారి జీవన ప్రమాణాలు కూడా పెంచుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను అదుపు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పిపిపి, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (VGF) ద్వారా మూలధన వ్యయాన్ని పెంచుతామని తెలిపారు. అంతిమంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్ది, 'స్వర్ణాంధ్ర విజన్ 2047' సాధించడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## 30 సెకన్లలో 34 కత్తిపోట్లు..!

ఇందుకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఫరీదాబాద్‌లోని సిర్కోనా ప్రాంతంలోని సరస్వతి సీనియర్ సెకండరీ స్కూల్ లో సంధ్య(26) అనే ఇంగ్లీష్ టీచర్ విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆమెను ఫరీదాబాద్ లోని కోట్ ప్రాంతానికి చెందిన అమిత్(21) అనే యువకుడు గత రెండేళ్లుగా వెంబడిస్తున్నాడు. ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. అయితే ఆమెకు అప్పటికే వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కానీ అమిత్ మాత్రం ఆమెను ప్రేమ పేరుతో ఇబ్బంది పెట్టసాగాడు. అయితే అమిత్ ప్రేమను సంధ్య నిరాకరిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే ఆమెపై కక్ష పెంచుకున్న అమిత్ ఎలాగైనా ఆమెను హతమార్చాలని ప్లాన్ వేశాడు. అలా సోమవారం ఉదయం సిర్కోనాలోని సరస్వతి సీనియర్ సెకండరీ స్కూల్‌లోకి మెల్లగా చొరబడ్డాడు. అదే సమయంలో సంధ్య విద్యార్థులకు పాఠాలు చెబుతోంది. దాంతో మెల్లగా క్లాస్ రూమ్ వద్దకు చేరుకుని సంధ్యను బయటకు పిలిచాడు. ఆమె అనుమానంగా చూడడంతో మీ భర్త వచ్చాడు.. రమ్మంటున్నాడు అని అన్నాడు. దాంతో సంధ్య క్లాస్ రూమ్ బయటకు రాగా ఆమెను బలవంతంగా స్కూల్ గేట్ వైపునకు ఈడ్చుకుంటూ వెళ్లాడు. ఇదే సమయంలో కత్తితీసి విచక్షణారహితంగా ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆమె మెడ, ఛాతిపై కేవలం 30 సెకన్లలోనే 34 సార్లు కత్తిపోట్లు పొడిచాడు. దాంతో ఆమె స్పృహ తప్పి అక్కడికక్కడే పడిపోయి ప్రాణాలు కోల్పోయింది. వెంటనే నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. ఇంతలో తోటి టీచర్లు వచ్చి చూడగా అప్పటికే సంధ్య మృతి చెందింది. అయితే ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడు అమిత్ ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



## వాతావరణ శాఖ హెచ్చరిక

- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు
- రాబోయే మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 4 :

తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్ర మట్టం వద్ద రుతుపవన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ మేరకు కామారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అలాగే హైదరాబాద్ సహా 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ప్రస్తుతం సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి బికనేర్, ఢిల్లీ, లక్నో, పాట్నా మీదుగా మణిపూర్ వరకు వ్యాపించి, సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. అదే సమయంలో, ఉత్తర కర్ణాటక నుంచి దక్షిణ కర్ణాటక, కేరళ, తమిళనాడు మీదుగా కొమొరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉన్న మరొక ద్రోణి ప్రస్తుతం బలహీనపడింది. ఈ వాతావరణ మార్పుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు.వాతావరణ పరిస్థి తీవ్రతను బట్టి వాతావరణ శాఖ వివిధ జిల్లాలకు హెచ్చరికలను జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షం కురిసే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అన్నారు. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం, చెట్ల కొమ్మలు విరిగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మరోవైపు, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్ధిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. అలాగే గంటకు 40 కిలోమీటర్ల లోపు వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.ఈ వర్షాల దృష్ట్యా వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు జాగ్రత్త వహించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద గానీ, విద్యుత్ స్తంభాల వద్ద గానీ నిలబడకూడదని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు మెరుపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు బయటకు రాకుండా ఉండడం మంచిదని జీహెచ్‌ఎంసీ, స్థానిక యంత్రాంగాలు అప్రమత్తం చేశాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలకు తగిన సహాయక చర్యలు అందించేందుకు విపత్తు నిర్వహణ బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు.

# మల్లీస్వామి కుటుంబానికి ఆర్థిక సహాయం

- ఆపద అంటే పార్టీలకతీతంగా, కులాలకు అతీతంగా సహాయం చేసే గొప్ప నాయకుడు తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- అడ్డగూడూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి
- రోడ్డు ప్రమాదంలో మరణించిన మల్లీస్వామి కుటుంబానికి 50 వేలు ఆర్థిక సహాయం చేసిన మంత్రి కోమటిరెడ్డి



**జయభేరి, అడ్డగూడూర్ :**

జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కదారి రమేష్, మాజీ ఎంపిటిసి గూడెపు పాండు, గోదల సోమన్న, కోమటిరెడ్డి అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తల చేతుల మీదుగా కుటుంబానికి 50,000 అందజేత. ఆపద అంటే పార్టీలకతీతంగా, కులాల కతీతంగా, మతాల కతీతంగా సహాయం చేసే గొప్ప ప్రజానాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని అడ్డగూడూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు పట్టణ కేంద్రనికి చెందిన బాలెంల మల్లీస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన విషయం యూత్ కాంగ్రెస్ అడ్డగూడూరు మండల అధ్యక్షుడు బైరెడ్డి సందీప్ రెడ్డి, అడ్డగూడూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తెలుపగా వారు వెంటనే వారి మాట కాదనకుండా వారి కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కదారి రమేష్, మాజీ ఎంపిటిసి గూడెం పాండు యూత్ అధ్యక్షులు బైరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ.. మేం ఏ రోజేనా ఆపద ఉందని మంత్రి వారి గడప తడితే, వారిది పేద కుటుంబం సార్ మీరు సహాయం చేసి ఆ కుటుంబానికి న్యాయం చేయాలి సార్ అని చెప్పగానే ఆపద అంటే పార్టీలకతీతంగా, కులాలకు అతీతంగా సహాయం చేసే గొప్ప నాయకుడు తెలంగాణ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారిశెట్టి మల్లేష్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు పూలపెల్లి రాజశేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు షేక్ సమీర్, కాంగ్రెస్ నాయకులు చుక్క యాదగిరి ఆసర్ల బీరుమల్లు, పరిగల సత్యనారాయణ, గండేలా రవి, తుప్పతి నరేష్, సకినాల బాలరాజ్, పరిగెల మహేష్, గండేలా హరీష్, కంచి మచ్చగిరి, తుప్పతి ఉపేందర్, కంచి నరేష్, కూతటి వెంకన్న, చిన్నం లక్ష్యయ్య, కందుకూరి లక్ష్మయ్య, బాలెంల సోమన్న, బోయపల్లి మధు, ఆసరా రమేష్, లోడంగి అనిల్, షేక్ సోహెల్, అలుగుబెల్లి సాయి రెడ్డి, అసర్ల పవన్, బాలెంల మహేష్, అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, కోమటిరెడ్డి బ్రదర్స్ అభిమానులు పాల్గొన్నారు.



## వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే

**జయభేరి, కాప్రా :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ MMC ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ కమిషనర్ విజయ్ కృష్ణా రెడ్డి (IAS), జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఐఏఎస్ పాల్గొని, నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, “ఒక్కో వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలం. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడం కూడా అందరి బాధ్యత” అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కేసు నమోదు చేసి అరెస్ట్

**జయభేరి, మేడిపల్లి :**

ఫిర్యాదిదారుడు బండారి అనూప్ కుమార్ (30), నివాసం దేవేందర్ నగర్ తెలియజేసిన దాని ప్రకారం తేదీ 27.06.2026 నాడు ఉదయం 04:30 hrs సమయంలో అంబేద్కర్ నగర్లో ఉన్న అతని యొక్క నూతన గృహప్రవేశం చేసినాడు. అలాగే రాత్రి 8:30కు తన యొక్క బంధువులతో ఇంటి ముందు మాట్లాడుతుండగా కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రణాళిక ప్రకారం చంపుదామనే ఉద్దేశంతో కర్రలతో హాకీ బ్యాట్లతో తన ఇంటి దగ్గరికి వచ్చి బూతు మాటలు తిట్టి ఇంట్లో ఉన్న సామాగ్రి డోర్స్, అద్దాలు, వాల్ సీలింగ్, నల్ల పైపులు, కుర్చీల ను డామేజ్ చేసి తన యొక్క తలపై కర్రెలతో కొట్టగా అతనికి రక్తగాయమైనది. అట్టి విషయంలో మేడిపల్లి పోలీస్ వారు కేసు నమోదు చేసి అందులోని ఒకడైన నేరస్థుడు మేకల సాయిబాబా (23) నివాసం రాజీవ్ నగర్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది.

## బాలాంజనేయ స్వామి.. దీవించవా..!



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వన్ టౌన్ సమీపంలోను న్న రాంనగర్ లో కొలువుదీరిన బాలాంజనేయ స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం పురోహితుడు రాజమూరి హన్మేష్ చారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు .ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరించారు.

## నడి రోడ్డుపై వ్యక్తిపై హత్యాయత్నం

**జయభేరి, హైదరాబాద్ :**

నడి రోడ్డు పై వ్యక్తిని దారుణంగా చంపే ప్రయత్నం చేసారు దుండగులు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగరేణి కాలనీలో ఘటన జరిగింది. హమేర్(35) అనే వ్యక్తిపై హత్యయత్నం చేసారు. హమేర్ పై గంజాయి బ్యాచ్ కత్తితో దాడి చేసిందని సమాచారం. స్థానికులు బాధితున్ని హాస్పిటల్ కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. హమేర్ పై గతంలో పలు చోరీ కేసులు నమోదు అయినట్లు సమాచారం. పాత కక్షలు, ఆర్థిక లావాదేవీలు కారణంగానే దాడి చేసినట్లు సమాచారం.

# తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- యాదగిరిగుట్ట అంగన్‌వాడీ కేంద్రం-3 సందర్శించిన
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**జయభేరి, యాదగిరిగుట్ట :**

అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే తల్లి బిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని అంగడిబజార్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం3ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతల వివరాల సంఖ్య ఎంత అని, ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి హాజరవుతున్నారా లేదా అని, హాజరును ఎలా నమోదు చేస్తున్నారని అడిగి తెలుసుకొని, అటెండెన్స్ నిర్వహణను పరిశీలించారు. చిన్నారులకు ప్రతిరోజూ ఎలాంటి పోషకాహారం ఇస్తున్నారని, చదువు, ఆటలు ఏ విధంగా నేర్పిస్తున్నారని అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల తల్లిదండ్రులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం చిన్నారులకు రంగులు, బొమ్మలు చూపించి వాటి పేర్లు చెప్పించాలని ప్రోత్సహిస్తూ వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందుతుందా లేదా అని, పాలు, గుడ్లు, పప్పులు తదితర పోషకాహార పదార్థాలు తగినంతగా సరఫరా అవుతున్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణీలతో కలెక్టర్ మాట్లాడారు. రక్తహీతన శాతం ఎంత ఉందని, ఏ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ స్కానింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని, మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని, జిల్లా జనరల్ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు సంబంధించిన అన్ని ఫారాలను అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి సేకరించాలని సూచించారు. ఇంకా మిగిలి ఉన్న వారి నుండి కూడా ఫారాలు సేకరించి, పూర్తిగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా సరిచూసి సమర్పించాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగే రమ్య, మున్సిపల్ కౌన్సిలర్లు బిట్టు సరోజ, కర్రె మాధవి, బోడ రాధా, స్థానిక అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



## నివాసాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు

- సాయిబాబా నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ అంశం పై విద్యుత్ శాఖ అధికారిని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

కాప్రా డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో ప్రతిపాదించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్న ఆందోళన నేపథ్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హబ్సిగూడ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆపరేషన్) ఇంజి. పి. వెంకన్నని వారి కార్యాలయంలో ఉప్పల్ లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నివాసాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల వైబ్రేషన్, శబ్ద కాలుష్యం తదితర సమస్యలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల అభ్యంతరాలను గౌరవించి, సాయిబాబా నగర్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని లేదా జనావాసాలకు దూరంగా ప్రత్యామ్నాయ స్థలాన్ని పరిశీలించాలని కోరారు. ప్రజల భద్రత, ఆరోగ్యం, ప్రశాంత జీవనమే తమకు ముఖ్యమని, స్థానికుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ ఇంజి. పి. వెంకన్న ఎమ్మెల్యే వినతిని స్వీకరించి, ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తా..

**జయభేరి, మేడిపల్లి :**




మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.డి. ఖాజా మొయినుద్దీన్ ఆధ్వర్యంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ల మైనారిటీ సెల్ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏ బ్లాక్ మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ రహ్మత్ అలీ, బీ బ్లాక్ అధ్యక్షులు షేక్ అక్బర్, చెంగిచర్ల డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ యకూబ్, ఎల్లంపేట్ డివిజన్ రాజబొల్లారం అధ్యక్షులు పాషా, శామీర్‌పేట్ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ అజీముద్దీన్, పీర్జాదిగూడ డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ కరీం, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ అజ్గర్, ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షులు షేక్ సల్మాన్ ఖాన్, నాగారం డివిజన్ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్, గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులు షేక్ మహబూబ్, మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ అమీర్ ఖాన్, మూడుచింతలపల్లి డివిజన్ అధ్యక్షులు యూసఫ్, పుడూర్-కిష్టాపూర్ డివిజన్ అధ్యక్షులు ముక్తర్, కీసర డివిజన్ అధ్యక్షులు అన్వర్ పాషాలకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చెంగిచర్ల డివిజన్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ యకూబ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.డి. ఖాజా మొయినుద్దీన్, మొహమ్మద్ యుసుఫ్ బాబా, పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ చెంగిచర్ల డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి, మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, యువతను కాంగ్రెస్ పార్టీలోకి ఆకర్షించేందుకు నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు నూతనంగా నియమితులైన మైనారిటీ సెల్ అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు ముజీబ్ ఉద్దీన్, బోడుప్పల్ మాజీ అధ్యక్షులు పోగుల నరసింహ రెడ్డి, చెంగిచర్ల డివిజన్ అధ్యక్షులు దిలీప్ రెడ్డి, బోడుప్పల్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ యుసుఫ్ బాబా, ఘట్కేసర్ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పీర్జాదిగూడ నాయకులు మహమ్మద్ మజర్, యూత్ కాంగ్రెస్ నాయకులు అజ్జు, మొహమ్మద్ తాజుద్దీన్, అబ్దుల్ ఖాదర్, మొహమ్మద్ సమీ పాల్గొన్నారు.



## వైటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు

- ఈశ్వరమ్మ కి ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి సన్మానం



**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 04 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మను ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఈశ్వరమ్మ నివాసంలో ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో మర్యాదపూర్వకంగా కలిసిన గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆమెను అభినందించి సన్మానించారు. యాదగిరిగుట్ట ఆలయ బోర్డు సభ్యురాలిగా నూతన బాధ్యతలు స్వీకరించినందుకు ఈశ్వరమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి క్షేత్ర అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు ఈశ్వరమ్మ తన వంతు కృషి చేయాలని, శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి కోరారు.

## జత్వానీ కేసు దేశంలోనే అరుదైనది

- మాజీ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు

**జయభేరి, విజయవాడ :**

నటి కాదంబరి జత్వానీ కేసు దేశంలోనే అరుదైన కేసుగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అభివర్ణించారు. ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే అరెస్టులు చేశారని.. అనంతరం తప్పుడు కేసుతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారని ఆరోపించారు. బాధితురాలు ఎలా నిందితురాలిగా మారిందని అయన 'ప్రశ్నించారు. చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని.. సాక్ష్యాలు లేకుండానే ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తున్నారని సీఐడీ దర్యాప్తుపై విమర్శలు గుప్పించారు. జత్వానీ కేసులో జరిగిన పరిణామాలు న్యాయవ్యవస్థ, దర్యాప్తు విధానాలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని అయన వ్యాఖ్యానించారు.




## బసంతాపురం గ్రామంలో మెగా పశువైద్య శిబిరం

**జయభేరి, రాజపేట, ఆగస్టు 04 :**

రాజపేట మండలంలోని బసంతాపురం గ్రామంలో మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మెండు సత్తిరెడ్డి రత్నమాల,వార్డు సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం మెగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో రఘునాథపురం పశువైద్యాధికారి డాక్టర్ భాస్కర్,పశు సంవర్ధక అధికారి పెండెం శ్రీనివాస్, సిద్ధులు, రవి, అశోక్, వెంకటేష్, బసంతాపురం గోపాలమిత్ర మహేష్‌తో పాటు గ్రామానికి చెందిన పాడి రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పశువులకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించి రైతులకు పశువుల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల పాడి రైతులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ మెండు సత్తిరెడ్డి రత్నమాల ఆధ్వర్యంలో గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించడం ఎంతో సంతోషకరమని రైతులు పేర్కొంటూ సర్పంచ్‌ను అభినందించారు.




## క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు

- లక్ష్మీ పల్లి సర్పంచ్ పెద్ద మోని లక్ష్మీ ఆంజనేయులు




**జయభేరి, దేవరకద్ర :**

విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహబూ బ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లి గ్రామ సర్పంచ్ పెద్ద మోని లక్ష్మీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం లక్ష్మీ పల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లల్లో నిర్వహించిన బాలల సభ కు సర్పంచ్ ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు పై శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో చదువుకుంటేనే అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు.విద్యార్థులు చదువుతోపాటు కలలు, సాంస్కృతిక కార్యక్రమంలో రాణిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాంచంద్రయ్య, ఉన్నత పాఠశాల హెచ్ యం కె. మురళీ ధర్, ప్రాథమిక పాఠశాల ఇంచార్జి హెచ్ యం లయన్ అశ్విని చంద్రశేఖర్, వార్డు సభ్యులు రాములు, మంగమ్మ, వెంకటేష్, ఉపాధ్యాయులు శంకర్, మదన్ మోహన్, విజయ లక్ష్మీ, నాగేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## జూరాల ప్రాజెక్టులో పెరుగుతున్న వరద

- 33 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- ప్రాజెక్టు ఇన్ ఫ్లో 241000 వేల క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో 251836 వేల క్యూసెక్కులు



**జయభేరి, దేవరకద్ర :**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టులో రోజురోజుకు వరద పెరుగుతుంది. దీంతో మంగళవారం ప్రాజెక్టు 33 గేట్లు ఎత్తు దిగువకు నీటిని విడుదల చేశారు.ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టు లోకి వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 241000 వేల క్యూసెక్కులు. అవుట్ లో 251836 వేల క్యూసెక్కులు. ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదల కూడా కొనసాగుతుంది. ప్రాజెక్టులో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరడంతో జూరాల నిండుకుండను తలపిస్తుంది. నీటి రాకతో రైతుల ఆనందం వ్యక్తం అవుతుంది.

# మహా ధర్నాను విజయవంతం చేయాలి

- పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ పిలుపు

**జయభేరి, మేడిపల్లి :**




విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న సుమారు ₹10,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న బోడుప్పల్ బస్ స్టాప్ వద్ద నిర్వహించనున్న మహా ధర్నా పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వేలాది మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేకించి ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులపై భారీ ఫీజుల భారం పడిందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలు విద్యార్థులపై పూర్తి ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయని అన్నారు.

ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థులకు టీసీ, మెమోలు, డిగ్రీ సర్టిఫికెట్లు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, నోడ్యూస్ వంటి అవసరమైన పత్రాలను కళాశాలలు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, విదేశీ విద్య అవకాశాలను కోల్పోతున్నారని పేర్కొన్నారు. మరోవైపు తల్లిదండ్రులు అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్నప్పటికీ, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మరింత ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యను హక్కుగా భావించి విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ఎలాంటి ఆలస్యం లేకుండా విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 6న బోడుప్పల్ బస్ స్టాప్ వద్ద నిర్వహించే మహా ధర్నాను విద్యార్థులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా హక్కుల పరిరక్షణ కోసం ప్రతి విద్యార్థి ఈ పోరాటంలో భాగస్వామి కావాలని కోరింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు అవినాష్, జిల్లా ఉపాధ్యక్షులు భగత్, మండల అధ్యక్షులు కౌశిక్, మండల ఉపాధ్యక్షులు అక్షయ్‌తో పాటు పలువురు విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

# రూ. 1.16 కోట్లతో బాక్స్ డ్రైన్.. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా, ఆగస్టు 4:**



మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్, కృష్ణానగర్, తిరుమలనగర్ కాలనీలలో రూ.1.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ, ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ, డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి విశేష సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. చేపట్టనున్న అభివృద్ధి పనులు.. 1. లక్ష్మీనగర్ నుండి ఇంద్రనగర్ ఫేజ్-2 వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణం. 2. తిరుమలనగర్ జేవన్ టీ పాయింట్ సమీపంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం. 3. కృష్ణానగర్ రోడ్ నెం.9లో బాక్స్ డ్రైన్ నిర్మాణం. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం వేణుగోపాల్, ఏజీఎం రోహిత్, ఏఈ స్పందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, మల్లేష్ గౌడ్, మల్లారెడ్డి, దేవిరాజ్, జంపాల్ రెడ్డి, సత్తిరెడ్డి, నరసింహ గౌడ్, నవీన్ గౌడ్, బాలయ్య గౌడ్, అంజయ్య గౌడ్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, రాజు, రామకృష్ణ, చక్రవర్తి, కిరణ్, శేఖర్ గౌడ్, శివ, కోటి రెడ్డి, నరసింహ గౌడ్, బాల్ రెడ్డి, కామేశ్వరరావు, కృష్ణమోహన్, శ్రీనివాస్, మురళీ ప్రసాద్, రామ్ రెడ్డి, మాధవరావు, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, మాలాద్రి, సుబ్బారెడ్డి, నారాయణ రెడ్డి, శంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మూర్తి, వెంకటేశ్వరరావు, ఆర్టీసీ గౌరీశంకర్, గౌరీశంకర్, దండెం నరేందర్‌తో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ

**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 4:**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మేడ్చల్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కౌడే మహేష్ కురుమ ఖండించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు కేటీఆర్ ప్రయత్నించడం తగదన్నారు. గతంలో ఇంజినీరింగ్ విద్యార్థులు, ఇంజినీరింగ్ కళాశాలలపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ముందుగా గుర్తు చేసుకోవాలని సూచించారు. యువతను, విద్యార్థులను మోసం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించిన ఆయన ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. ప్రెస్‌మీట్లు, బహిరంగ సభల పేరుతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కేటీఆర్ విరమించుకోవాలని మహేష్ కురుమ సూచించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు కొనసాగితే ప్రజలే మరోసారి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# ఆగస్టు 6న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

- పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదలపై విద్యార్థుల మహా ధర్నా విజయంతం చేయాలి
- విద్యార్థుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయం ఎస్ఎఫ్ఐ లక్ష్యం
- షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్
- షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు విజ్ఞాన్ డిగ్రీ విద్యార్థులతో సమావేశం..

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 04 :**




విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యంగా ఈనెల 6న హైదరాబాద్లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద నిర్వహించనున్న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని మేరకు మంగళవారం షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో ఎదురవుతున్న సమస్యలపై పోరాడేందుకు, దుకు ప్రభుత్వ విద్యను కాపాడుకు నేందుకు 'ఛలో హైదరాబాద్' కార్యక్రమాన్ని తలపెట్టినట్టు తెలిపారు. విద్యార్థులందరూ ఐక్యంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం కార్యక్రమానికి షాద్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించే ఈ పోరాటాన్ని జయప్రదం చేయడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. 6న జరిగే ధర్నా చౌక్ విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాల కళాశాలల విద్యా ర్థులు భారీ సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రాంచరణ్, తరుణ్, రాజేష్, శ్రీనేతన్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ కు హిట్లర్ ఆదర్శం



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 4 :**

హైడ్రా'పై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అనేది పేదల ఇళ్లను కూలగొట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ఒక వేధింపుల సంస్థగా మారిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వానికి అధికారులను నియమించే విచక్షణాధికారం ఉండవచ్చు కానీ, పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసే అధికారం మాత్రం లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హైడ్రాను స్థాపించారని ఈటల అన్నారు. నాడు హిట్లర్ ప్రజలను వేధించి తీవ్ర విధ్వంసం సృష్టిస్తే, నేడు రేవంత్ రెడ్డి హైడ్రా ద్వారా తెలంగాణ ప్రజలను అదే రీతిలో వేధిస్తున్నారని ఆరోపించారు. నలభై, యాభై ఏళ్ల క్రితం రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి చెరువులు, కాలువల పక్కన రెక్కల కష్టం మీద ఇళ్లు కట్టుకున్న పేదల నివాసాలను ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన బడా బాబులకు భూములు కట్టబెట్టడానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవారిని బ్లాక్‌మెయిల్ చేయడానికే రేవంత్ రెడ్డి హైడ్రాను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారని ఈటల విమర్శించారు. ప్రస్తుతం నగరంలో హైడ్రా భయంతో ఇల్లు కొనడానికి కూడా ప్రజలు జంకుతున్నారని వ్యాఖ్యానించారు. రెవెన్యూ, మున్సిపల్, హోం శాఖల కంటే హైడ్రా ఒక సుప్రీం శాఖలా వ్యవహరిస్తోందని, ఆఖరికి కోర్టుల ఆదేశాలను కూడా లెక్క చేయడం లేదని ధ్వజమెత్తారు. అసలు ఈ సంస్థ సీఎం రేవంత్ రెడ్డి మాటైనా వింటుందో లేదో అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు.

# బోనాల వేడుకలకు ముస్తాబవుతున్న మేడ్చల్

- రోడ్డు పనులు పరిశీలించిన రాఘవేంద్ర గౌడ్

**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 4:**




సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ పట్టణం 297వ డివిజన్‌లో గురువారం నిర్వహించనున్న పోచమ్మ బోనాల ఉత్సవాల ఏర్పాట్లు సాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఆర్.ఆర్. ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ సీనియర్ నేత రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ మంగళవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతిని పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం ఉదయానికల్లా నాణ్యతా ప్రమాణాలతో అన్ని పనులు పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ పోచమ్మ బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులు, ముఖ్యంగా మహిళలు సౌకర్యవంతంగా ఆలయానికి చేరుకునేలా రహదారి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుని పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను 297వ డివిజన్ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆర్.ఆర్. ఫౌండేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బర్షాపేట్, భరత్ నగర్ లో సి.సి రోడ్లు

- బోనాల పండుగ సందర్భంగా ఆలయాల పరిసరాల్లో రోడ్లు నిర్మాణం పూర్తి
- మైనంపల్లి హనుమంతరావు కట్ ఓట్ కు కాంగ్రెస్ నాయకులు,స్థానికులు పాలాభిషేకం

జయభేరి, కీసర సర్కిల్ :

మాజీ మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక చొరవతో యాప్రాల్ డివిజన్ కి చెందిన కౌకూర్ బర్షాపేట్, భరత్ నగర్ పోచమ్మ దేవాలయాల పరిసరాల్లో బోనాల ఉత్సవాలను దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునే విధంగా రూ.10.48 లక్షల నిధులతో సి.సి కాంక్రీట్ బెడ్ మరియు CC రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యాయి. గతంలో కూడా పోచమ్మ దేవాలయాల నిర్మాణానికి తన సొంత నిధులతో సహకారం అందించిన మైనంపల్లి హనుమంతరావు, మరోసారి దేవాలయాల అభివృద్ధికి చొరవ తీసుకుని పనులు త్వరితగతిన మంజూరు చేయించి పూర్తి చేయించినందుకు కృతజ్ఞతగా కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు ఆయన





కట్ ఓట్ కు పాలాభిషేకం చేసారు. ఈ అభివృద్ధి పనుల కోసం బర్షాపేట్ యువకులు మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్‌ను సంప్రదించగా, ఆయన వెంటనే మైనంపల్లి హనుమంతరావుకు విషయం తెలియజేసి సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన మంజూరు అయ్యేలా కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు తుదిమెళ్ల మల్లికార్జున మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారం, దేవాలయాల అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమం కోసం ముందుంటుందని, మైనంపల్లి హనుమంతరావు ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న ప్రజానాయకుడు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాజ్, బొడ్డు శ్రీనివాస్ యాదవ్, శ్రావణ్, గోమారం అంజి రెడ్డి, అల్లి మల్లేష్, ఎన్ను వెంకట్ రెడ్డి, అల్లి పండు, ఆసిఫుల్లా ఖాన్, అల్లి సత్యనారాయణ, సయ్యద్ అస్లాం, రజని కాంత్, తివారి, సుభేదార్ యాదవ్, ఖలీల్, మోహన్ రావు, జయంత్, శ్రీకాంత్, శామ్యూల్ , ప్రవీణ్, భరత్, రాజ్ కుమార్తో పాటు భార్షాపేట్, భారత్ నగర్ బస్తీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అలియాబాద్‌లో ఘనంగా వనమహోత్సవం

- ప్రజలకు మొక్కల పంపిణీ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి

జయభేరి, మేడ్చల్ :

అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటి ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు త్వరగా ఇళ్లు అందేలా నిర్మాణాలు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ భాస్కరరావు



జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 04 :

ఇందిరమ్మ ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ భాస్కర రావు హౌసింగ్ డిపార్ట్మెంట్ చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్ లు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఇంటింటికి తిరిగి పరిశీలించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలను మైవన్ టెక్నాలజీ ద్వారా నిర్మాణం చేపట్టిన ఇండ్లను నాణ్యత పరిశీలించారు. ఇందిరమ్మ ఇల్లు వేగవంతం త్వరగా పూర్తి చేయాలని,ఉన్నత పాఠశాల తరగతి ల నిర్మాణం ను పరిశీలించారు. ఆర్థిక భారం ఉన్న లబ్ధిదారులకు వివిధ ఏజెన్సీ సాయి మణికంఠ ఇన్ఫ్రా, ఆస్ట్రానిక్ కన్స్ట్రక్షన్, స్కై పాత్ ఇన్ఫ్రా ఏజెన్సీ ల ద్వారా నిర్మాణాలు పనులు వేగవంతం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు షేర్ వాల్ టెక్నాలజీ నాణ్యత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల పిడి అలివేలు, ఎంపీడీవో గీతారెడ్డి, డి ఈ హౌసింగ్ శ్రీరాములు,హౌసింగ్ ఏఈ నరేష్, గ్రామ సర్పంచ్ దొమ్మాట అనురాధ బాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంజ నరేష్ ఉపసర్పంచ్ జేరిపోతుల బాల నర్సయ్య, కారోబార్ దుడుక బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నల్గొండ రీజియన్ సర్వసభ్య సమావేశం



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నల్గొండ రీజియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు ఎంజే ఖాన్ ఉపాధ్యక్షుడు ఈద్దయ్య యాదవ్ కార్యదర్శి రాజేందర్ గౌడ్ కార్యనిర్వాన కార్యదర్శి స్వామి నాయక్ ,ఉప్పల శ్రీనివాస్ వారి బృందం పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి అశ్వద్ధామ రెడ్డి పాల్గొని కార్మికుల సంక్షేమం భవిష్యత్ కార్యక్రమం పై వివరించడం జరిగింది.

## సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంపై అవగాహన సమావేశం



జయభేరి, కొండమల్లేపల్లి :

నల్గొండ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శరత్ చంద్ర పవార్, IPS ఆదేశాల మేరకు, దేవరకొండ డీఎస్పీ ఆధ్వర్యంలో, మల్లేపల్లి సీఐ, మల్లేపల్లి ఎస్ఐ, పోలీసు సిబ్బంది సమక్షంలో కొండమల్లేపల్లి టౌన్‌లోని వ్యాపారులు, వివిధ వర్తక సంఘాల ప్రతినిధులతో సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, ప్రజల సహకారంతో ప్రతి వ్యాపార సంస్థ, దుకాణం, వాణిజ్య సముదాయం, ప్రధాన కూడళ్లలో నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలు, చోరీలు, ఇతర నేరాలను అరికట్టడంతో పాటు, నేరాల దర్యాప్తు వేగవంతంగా జరిగి నిందితులను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉంచాలని, పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో వర్తక సంఘాల ప్రతినిధులు పోలీసు శాఖ కార్యక్రమాన్ని అభినందిస్తూ, సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.



## కల్వకుంట్ల ఫ్యామిలీలో రచ్చ

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 4 :

కేసీఆర్.. తెలంగాణ ఉద్యమ నాయకుడిగా దేశమంతటికీ పరిచయం. తెలంగాణ రాష్ట్రం సాధనలో ముందు నడిచిన నేతగా రాష్ట్రంలో ఆయనకంటూ ప్రత్యేక గుర్తింపు ఉంది. రాష్ట్రం సాధించాక పదేళ్లు ఆయన సీఎంగా పనిచేశారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్‌లో ముసలం మొదలంది. చివరకు కేసీఆర్ కుటుంబంలోనూ చిచ్చు రేగింది. కూతురు కవిత సొంత పార్టీపైనే విమర్శలు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో కవిత ఇటీవలే టీఆర్ఎస్ పార్టీ ప్రకటించి రాజకీయాలు చేస్తోంది. ఈ క్రమంలో పార్టీని వీడిన తర్వాత కవితపై ఆమె సోదరుడు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె వేరే మార్గం ఎంచుకున్నారని, పార్టీలో ఇచ్చిన అవకాశాలపై కృతజ్ఞత లేదని వ్యక్తం చేశాడు.కవిత గతంలో బీఆర్ఎస్‌లో ఎంపీ, ఎమ్మెల్సీగా పనిచేశారు. రాష్ట్ర ఉద్యమం, పార్టీ పెరుగుదలలో కుటుంబం కీలక పాత్ర పోషించింది. అయితే ఇటీవల కాలంలో ఆమె పార్టీ నుంచి వేరుపడి స్వతంత్ర మార్గం అనుసరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పార్టీ నాయకత్వం, నిర్ణయాలపై విమర్శలు చేశారు. దీనికి ప్రతిస్పందనగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.కవితకు పార్టీలో తగిన అవకాశాలు కల్పించినట్లు కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాష్ట్రం కోసం జీవితం అంకితం చేశారని గుర్తు చేస్తూ, అలాంటి వ్యక్తిపై విమర్శల దాడి చేయడం ప్రత్యర్థులకు భిన్నంగా లేదని అభిప్రాయపడ్డారు. అవకాశాలు ఇచ్చినా కృతజ్ఞత లేకుండా పార్టీ అధినేతను విమర్శించడం సహించలేని విషయమని సూచించారు. ''అలానే కానివ్వండి'' అనే స్వరం ద్వారా ఆమె మార్గంపై దూరం పాటించే వైఖరిని వ్యక్తం చేశారు.బీఆర్ఎస్‌లో కేసీఆర్, కేటీఆర్, కవిత మధ్య వారసత్వం, నాయకత్వ పంపిణీపై అంతర్గత ఒత్తిళ్లు ఉన్నాయని గత నివేదికలు సూచిస్తున్నాయి. కవిత స్వతంత్ర పార్టీ ప్రయత్నాలు లేదా విమర్శలు ఈ ఘర్షణను బహిరంగం చేశాయి. కేటీఆర్ వ్యాఖ్యలు పార్టీలోని మిగతా నాయకులకు, కార్యకర్తలకు సందేశం ఇచ్చే ప్రయత్నంగా చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో కుటుంబ ఆధారిత పార్టీలు సాధారణం. అయితే ఇలాంటి విభేదాలు ఓటర్లలో గందరగోళం సృష్టించవచ్చు. ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్‌కు ఐక్యత అవసరం. కేటీఆర్ పార్టీని బలోపేతం చేసే ప్రయత్నంలో ఉన్నారు. కవిత తన మార్గంలో కొనసాగితే రాష్ట్ర రాజకీయాల్లో మరో కొత్త శక్తి ఆవిర్భవించే అవకాశం ఉంది. అయితే రెండు వైపులా ఉన్న విమర్శలు ప్రజల్లో నిరాశను కలిగించకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది.

## అక్కడి డ్రైనేజీ నీరంతా ఆ సెల్లార్ లోకే

జయభేరి, రంగారెడ్డి :

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీ లో సిల్వర్ ఓక్స్ అపార్ట్మెంట్ లోకి చుట్టుపక్కల ఉండే డ్రైనేజీ నీరు చేరిన నరకయాతన అనుభవిస్తున్నారు. గత మూడు రోజుల నుండి చుట్టు పక్కల ఉండే భూగర్భ డ్రైనేజీ నీరు అంతా తమ అపార్ట్మెంట్ లోకి చేరి మూడు రోజుల నుంచి కరెంటు, నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గత 20 రోజులుగా ఈ సమస్య ఉన్న తమను పట్టించుకునే నాథుడు అయ్యారని అన్నారు. ఎల్లమ్మ బండ తులసివనం వెళ్లే మార్గం లో నూతన రోడ్డు నిర్మాణం చేయగా కనీసం అవగాహన లేకుండా వేయడంతో చెరువు వైపు వెళ్లాల్సిన నీరు డ్రైనేజీ మ్యాన్ హోల్ పూర్తిగా మూసివేయడంతో నీరు అంతా వెనకకు చేరి అపార్ట్మెంట్ లోకి వస్తుందని అన్నారు. అధికారులు వస్తున్నారు చూస్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదుని అన్నారు. ఇప్పటికే అపార్ట్మెంట్లో ఉన్న అందరూ ఖాళీ చేసి వెళ్లారని వారు వెల్లడించారు.

# దంతాలపల్లి ఎస్సై రవికుమార్ ను సస్పెండ్ చేయాలని

- మహిళలపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- దళిత సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్

జయభేరి, దంతాలపల్లి, ఆగస్టు 4 :



మండలం లోని దొనకొండ అంగన్వాడి సెంటర్ లో అంగన్వాడీ టీచర్ మంజుల హెల్పర్ వెంకటలక్ష్మి లపై అదే గ్రామానికి చెందిన భోగిని నరేష్ అనే వ్యక్తి వీడియోలు ఫోటోలు తీస్తూ అసభ్య పదజాలం అనుచితంగా ప్రవర్తించిన ఘటన కేసు పెట్టాలని వెళ్లిన ఇద్దరు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి బెదిరింపులకు పాల్పడి అవమానపరిచిన దంతాలపల్లి ఎస్సై రవికుమార్ వెంటనే సస్పెండ్ చేయాలని దళిత సంఘాల నాయకులు మంద యాకమల్లు మాదిగ, ఎస్సీ జన సంఘం రాష్ట్ర కార్యదర్శి వెలిశాల శ్యామ్, విజయేందర్, దళిత కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు మద్దిరాల పరశురాం తదితరులు దంతాలపల్లి లో మాట్లాడుతూ దురుసు స్వభావంతో ప్రవర్తిస్తూ ప్రజల సేవకుడిగా కాకుండా అధికార మదంతో పోలీస్ స్టేషన్ కు వచ్చిన ప్రతి ఒక్కరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అసభ్య పదజాలంతో మాట్లాడుతున్న దంతాలపల్లి ఎస్సై ని ప్రభుత్వం వెంటనే రిమూవ్ చేయాలని వారు డిమాండ్ చేశారు మహిళలను గద్దించడంతో అంగన్వాడీ టీచర్ భయంతో స్పృహ కోల్పోయి కిందపడిపోవడంతో ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఇలాంటి ఘటనలు జరిగినా ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చెంచలి వెంకన్న, మధిరాల లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, స్టేషనరీ పంపిణీ

జయభేరి, కొండమల్లేపల్లి :



యూత్ ఫర్ సేవా ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారి సహకారంతో జడ్.పి.హెచ్.ఎస్ కొండమల్లేపల్లి పాఠశాలలో సింగిల్ పేరెంట్స్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ మరియు స్టేషనరీ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు గత ఐదు సంవత్సరాలగా మన zphs కొండమల్లేపల్లి పాఠశాలలో స్కూల్ బ్యాగ్స్ మరియు NMMS మెటీరియల్ ఇవ్వడం జరుగుతుంది. అలానే పాఠశాల ప్రధానోపాధ్యాయులు, MEO నాగేశ్వరరావు విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ... 202526 సంవత్సరంలో NMMS పరీక్షకి గాను 40 మంది విద్యార్థులు అప్లై చేసుకుంటే, 12 మంది విద్యార్థులు సెలెక్ట్ అయ్యారు. విద్యార్థులు ఈ విజయాన్ని సాధించడానికి ఉపాధ్యాయుల సపోర్టు యూత్ ఫర్ సేవా, అరనైజేషన్ హైదరాబాద్ వారి సహకారం ఎంతో ఉపయోగపడింది. సెలెక్ట్ అయిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జనార్ధన్, సైదా నాయక్, మల్లెపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రాములు, హనుమంత్ యూత్ ఫర్ సేవ వాలంటీర్స్ కదారి శ్రీశైలం, V. రాజు, గోపి, MD అబ్దుల్, పాల్గొనడం జరిగింది.

# విశ్వకర్మల అభివృద్ధే లక్ష్యం

- నల్లగొండ జిల్లా విశ్వకర్మ మనుమయ సంఘం ఉపాధ్యక్షులు గా సోనగంటి గోవర్ధనాచారి నియామకం
- సోనగంటి గోవర్ధనాచారి
- నల్లగొండ జిల్లా విశ్వకర్మ మనుమయ సంఘం ఉపాధ్యక్షులు

జయభేరి, చింతపల్లి :




విశ్వకర్మల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని నల్లగొండ జిల్లా విశ్వకర్మ మనుమయ సంఘం ఉపాధ్యక్షులు సోనగంటి గోవర్ధనాచారి అన్నారు.

హైదరాబాద్ లోని విశ్వకర్మ మనుమయ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు సుంకోజు కృష్ణమాచారి, గౌరవ అధ్యక్షులు కాసోజు విశ్వనాథచారి తీదేడు గ్రామానికి చెందిన సోనగంటి గోవర్ధనాచారి ని నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోని నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం సోనగంటి గోవర్ధనాచారి మాట్లాడుతూ... విశ్వకర్మల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విశ్వకర్మల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. నా ఎన్నికకు సహకరించిన నల్లగొండ జిల్లా అధ్యక్షులు చొల్లేటి రమేష్ కి, కార్యదర్శి వెంకటాచారి కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు.



# 30 కోట్ల బడ్జెట్.. 40 లక్షల కలెక్షన్

కాజల్ నటించిన ది ఇండియా స్టోరీ సినిమా హిందీలో విడుదలైంది. చేతన్ డి.కె దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే, మురళీ శర్మ తదితరులు నటించారు. రూ. 30 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం ప్రతికూల సమీక్షలను ఎదుర్కొని, టికెట్ అమ్మకాలలో మందగమనాన్ని చవిచూసింది. మొదటి రోజు ఇది కేవలం రూ. 16 లక్షలు మాత్రమే వసూలు చేసింది. రెండవ రోజు ఈ చిత్రం రూ. 25 లక్షలు వసూలు చేసింది. ఇప్పటివరకు ఈ చిత్రం మొత్తం రూ. 46 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. కేవలం 3 రోజుల్లో ఒక్క కోటి రూపాయలు కూడా వసూలు చేయలేకపోవడం నిర్మాతకు పెద్ద నిరాశను కలిగించింది. ఈ చిత్రం కాజల్ అగర్వాల్‌కు కూడా ఎదురుదెబ్బ తగిలించింది. ఆమె రాబోయే హిందీ చిత్రం 'రామాయణం'లో మండోదరి పాత్రను పోషిస్తోంది. ఈ చిత్రం ఈ ఏడాది చివరి నాటికి విడుదల కానుంది. సామాజిక కథాంశంతో తెరకెక్కించిన ఈ కోర్ట్ డ్రామా చిత్రాన్ని 24 జూలై 2026లో థియేటర్లలో రిలీజ్ చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ బ్యానర్‌పై సాగర్ బి. షిండే ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్ ఆలస్యం కావడం వల్ల జూలై 24న కేవలం హిందీ వెర్షన్ మాత్రమే విడుదలైంది.



# సూర్య ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్..

## 'విశ్వనాథ్ & సన్స్' తర్వాత మరో సినిమా ఈ ఏడాదే రిలీజ్!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇటీవల విడుదలైన 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడంతో ఆయన కెరీర్ మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి వచ్చింది. ఈ విజయోత్సాహంలో ఉన్న సూర్య, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'విశ్వనాథ్ & సన్స్' విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించగా, ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రీరిలీజ్ బజ్ కూడా పాజిటివ్‌గా ఉండటంతో, ఈ ఏడాది సూర్యకు మరో విజయాన్ని అందిస్తుందనే నమ్మకంతో అభిమానులు ఉన్నారు. ఇదిలా ఉండగా, తన 47వ సినిమాకు సంబంధించి సూర్య తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. ప్రముఖ దర్శకుడు జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని ఆయన వెల్లడించారు. ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని 2026 ముగిసేలోపే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నామని తెలిపారు. ఈ సినిమాను సూర్య సొంత నిర్మాణ సంస్థ 2D ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే సినిమా టైటిల్‌తో పాటు విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఇప్పటికే 'కరుప్పు'తో భారీ విజయాన్ని అందుకున్న సూర్యకు, 'విశ్వనాథ్ & సన్స్'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం కూడా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకుంటే, జితు మాధవన్ దర్శకత్వంలో వస్తున్న 47వ సినిమా విడుదలతో సూర్య వరుసగా మూడు విజయాలను ఖాతాలో వేసుకునే అవకాశం ఉంది. కొంతకాలంగా సరైన బ్లాక్‌బస్టర్ కోసం ఎదురుచూసిన సూర్యకు 2026 ఏడాది పూర్తిగా కలిసొచ్చినట్టే కనిపిస్తోంది. ఒకవేళ 'విశ్వనాథ్ & సన్స్', జితు మాధవన్ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటితే, ఈ ఏడాదిని హ్యాట్రిక్ విజయాలతో ముగించే అవకాశం ఉందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రస్తుతం సూర్య అభిమానుల దృష్టి మొత్తం ఆగస్టు 14న విడుదల కానున్న విశ్వనాథ్ & సన్స్ నిలిచింది. ఆ సినిమా ఫలితంతో పాటు, జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్, రిలీజ్ డేట్ ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మాయలేడీ విన్యాసాలు



రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'మాయలేడీ'. ప్రశంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సాగే లవ్‌స్టోరీ ఇదని, కథానాయిక పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుందని, యాక్షన్‌కు కూడా ప్రాధాన్యత ఉంటుందని మేకర్స్ తెలిపారు. గ్లింప్స్ చివరలో 'ఇప్పుడు నా లవ్‌స్టోరీలో విలన్ ఎవరో తెలుస్తున్నది' అంటూ హీరో చెప్పిన డైలాగ్ కథపై ఆసక్తినిరేకెత్తిస్తున్నది. మధుమిత, సర్కార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణ సంస్థ: క్రేజీయాంట్స్ ప్రొడక్షన్స్, రచనదర్శకత్వం: ప్రశంకర్.

# గచ్చిబౌలిలో చార్మినార్ సెటప్..
# ప్రభాస్ ఫౌజీ షూటింగ్‌కు సాలిడ్ ప్లాన్!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి-లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్ర బృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25 రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఇటీవల సినిమా విడుదల వాయిదా పడుతుందంటూ సోషల్ మీడియాలో పలు వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, వాటికి నిర్మాతలు ఇప్పటికే చెక్ పెట్టారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీసిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండియర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయికతో 'ఫౌజీ' భారతీయ సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.



# డీప్‌ఫేక్ బారిన మృణాల్ ఠాకూర్..

బాలీవుడ్‌తో పాటు దక్షిణాది సినీ పరిశ్రమలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ మరోసారి వార్తల్లో నిలిచారు. డీప్‌ఫేక్ ఫొటోల కారణంగా హాట్ టాపిక్‌గా మారింది. తనకు సంబంధించిన మార్ఫింగ్ చేసిన చిత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై మృణాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐ సాయంతో రూపొందించిన ఈ డీప్‌ఫేక్ చిత్రాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ కావడంతో మృణాల్ స్పందించక తప్పలేదు. ఈ ఫొటోలు పూర్తిగా నకిలీవని, తన అనుమతి లేకుండా రూపొందించి ప్రచారం చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన మృణాల్ ఠాకూర్.. నా పేరుతో ప్రచారం చేస్తున్న ఈ మార్ఫింగ్ ఫొటోలు పూర్తిగా అనధికారికమైనవి, చట్టవిరుద్ధమైనవి. వెంటనే వాటిని తొలగించాలి. ఇటీవలి కాలంలో ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ పలువురు సినీ నటీమణుల ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇంతకుముందు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నతో పాటు పలువురు ప్రముఖ నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ వీడియోల బారిన పడ్డారు. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, డీప్‌ఫేక్‌లపై కఠిన చట్టాలు అవసరమన్న డిమాండ్ కూడా వినిపించింది. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా బహిరంగంగా స్పందించడంతో సోషల్ మీడియాలో జరుగుతున్న డిజిటల్ దుర్వినియోగంపై మరోసారి చర్చ మొదలైంది. మృణాల్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, ఆమెకు సంబంధించినట్లు ప్రచారం చేస్తున్న కొన్ని వివాదాస్పద పోస్టులు ఇప్పటికీ సోషల్ మీడియాలో కనిపిస్తుండటం గమనార్హం.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**